# సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం, 16, మే, 2025




**మాండవ్యా నదిని కాటేస్తున్న కాలుష్యం**

మాండవ్యా నదిని కాలుష్యం కాటేస్తోంది. నిర్వహణలోపంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. భరించలేని దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. -8లో



**లారీ డ్రైవర్ బీభత్సం**

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఓ బైక్, ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న బంకు, దాని పక్కనే వున్న చెట్టును ఢీకొట్టాడు. -8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.80 | రూ.100 |
| రెండోరకం | రూ.60 | రూ.70 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 731 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| సీబీ | 400 | 430 |
| బైవోల్టిన్ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 247.540 కిలోలు

## న్యూస్‌రీల్

### వింత ఆకారంలో కుక్క పిల్ల జననం



పెద్ద తిప్పసముద్రం: అన్నమయ్య జిల్లా పెద్ద తిప్పసముద్రం మండలంలోని బూచిపల్లిలో గురువారం వింత ఆకారంలో కుక్కపిల్ల జన్మించింది. డేగానిపల్లి నరసింహులు చెందిన కుక్క ఈ పిల్లకు జన్మనిచ్చింది. కాళ్లు, చేతులు శునకం లాగే ఉన్నా.. ముఖం వద్ద తొండం లాగా ఉంది. ముందు భాగం ఏనుగు ఆకారంలో.. వెనుక భాగం కుక్కలాగా ఉంది. గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి.. దీన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. తల్లి వద్ద పాలు తాగేందుకు తొండం అడ్డు రావడంతో అది కొద్దిసేపటికే మృతి చెందింది. ఇది జన్యులోపం వల్ల జన్మించి ఉండవచ్చని పశువైద్యులు తెలిపారు.

### 17నుంచి వైద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

మదనపల్లె సిటీ: రాష్ట్ర వైద్య,వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మదనపల్లె సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 17 నుంచి 26 వరకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఈ తరగతులకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. విద్యార్థులు నాయకత్వం వహించడానికి నైపుణ్యం కోసం.. భవిష్యత్తు తరాల నాయకుల తయారు చేయడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్ ఫీజులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, కార్యదర్శి రమణ, జయబాబు, ఆఫ్రిద్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

### పీజీ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మ మాట్లాడుతూ ఏప్రిల్‌లో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదలకు కృషిచేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కెఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ ఎంఏ తెలుగు, హిస్టరీ, పీఎస్ అండ్ పీఏ, ఎకనామిక్స్, ఉర్దూ ఎంకాం కోర్సులలో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సొంతం చేసుకున్నారని వివరించారు. అఫిలియేటెడ్ కాలేజీల్లో ఎం కామ్ లో 96.30 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఎమ్మెస్సీ.. బోటని, బయోకెమిస్ట్రీ, జియాలజీ,మ్యేథమ్యాటిక్స్ మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్మెంటల్ సైన్సు, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్, ఫుడ్ టెక్నాలజీ , ఎంపీఈడీ కోర్సుల్లో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం https: www.yvuexams.in/results.aspx అనే వెబ్సైట్‌ను సందర్శించాలని కృష్ణారావు సూచించారు.

### ఏఐ శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానం



మాట్లాడుతున్న శ్రీకాంత్ అరిమాదిత్య

కురబలకోట: ప్రపంచ మంతటా ఇప్పుడు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) గాలి వీస్తోందని, అత్యంత శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానంగా అవతరిస్తోందని బెంగళూరులోని జార్పీ ల్యాబ్స్ సీఈఓ శ్రీకాంత్ అరిమాదిత్య పేర్కొన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నెక్స్ న్యూ ఏఐ వెంచర్ స్టూడియోపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎక్కడ చూసినా ఏఐ మాట విన్పిస్తోందన్నారు. వ్యవస్థలతో పాటు వ్యవసాయం, విద్య, వైద్యం, న్యాయం, పరిపాలన, ఉత్పాదకత,ఉద్యోగ అవకాశాలలో సత్తా చాటుతోందన్నారు. ప్రపంచ మంతటా అనేక ఏఐ వెంచర్ స్టూడియోలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కొత్త స్టార్టప్‌లను ప్రారంభించడం, పెట్టుబడులు సమీకరించడం, వ్యాపార అభివృద్ధిలో దోహదపడుతోందన్నారు. ఈ ఏడాదిని ఏఐ సంవత్సరంగా ఏఐ సీటీఈ కూడా ప్రకటించిందన్నారు. ఏఐతో సరికొత్త ప్రపంచం ఆవిష్కృతం కానుందన్న ధీమాను వ్యక్తం చేశారు.

# రైతు నెత్తిన లైనింగ్ పిడుగు

- 2.86 లక్షల ఎకరాల ఆయకట్టుకు కృష్ణా జలాలు లేనట్టే
- లైనింగ్ పనులతో ఆయకట్టుకు చుక్కనీరు పారదు
- ముందుచూపుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను సమాధి చేసిన కూటమి ప్రభుత్వం
- అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు అన్యాయం



పీబీసీలో లైనింగ్ పనులు

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు, కడపజిల్లాల రైతుల తలరాతను మార్చేలా పుష్కలంగా సాగు, తాగునీటిని అందించేలా పథకాలు చేపట్టి రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహత్తర పథకాలను పక్కనపెట్టింది. అంతేకాక రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న హంద్రీ-నీవా ప్రాజెక్టులో భాగమైన పుంగనూరు ఉపకాలువ, కుప్పం ఉపకాలువలకు లైనింగ్ పనులు చేపట్టిన ఫలితంగా 2.86 లక్షల ఎకరాల ఆయకట్టుకు చుక్కనీరు పారకుండా బీళ్లుగా మారిపోయే ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయి. లైనింగ్ పనులపై ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ భవిష్యత్ పరిస్థితులపై కనీసం పట్టించుకోకపోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి పథకాలపై కక్షకట్టిన ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. అయినప్పటికీ రాజకీయ ప్రయోజనాలతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.



### లైనింగ్‌తో 2.86 లక్షల ఎకరాలు బీళ్లు

ప్రాజెక్టుల అనుసంధానం, కాలువ వెడల్పు పనులు పూర్తయ్యాక జిల్లాలో 2.86 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యం. అయితే కూటమి ప్రభుత్వం కాలువలకు లైనింగ్ పనులు చేపట్టిన కారణంగా ఒక్క చుక్కనీరు కూడా పొలాలకు పారించే అవకాశం లేదు. మనం వాడుకోవాల్సిన 25 టీఎంసీలలో కనీసం రెండు టీఎంసీలైనా తరలించుకునే అవకాశం లేదు. ఈ లైనింగ్ కారణంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో 41,150 ఎకరాలు, పుంగనూరు నియోజకవర్గంలో 17,800, పలమనేరులో 8,100, చిత్తూరులో 6,200, చంద్రగిరిలో 6,400, పీలేరులో 76,200, జీడీనెల్లూరులో 4,050, పూతలపట్టులో 16,100 ఎకరాలకు సాగునీరు అందదు. కొత్త నిర్మాణం మొదలై అడ్డంకులతో ఆగిపోయిన ముదివేడు రిజర్వాయర్ కింద 35వేల ఎకరాలు, నేతికుంటపల్లె రిజర్వాయర్ కింద 15వేల ఎకరాలు, ఆవులపల్లె రిజర్వాయర్ కింద 60వేల ఎకరాల ఆయకట్టు భూమికి చుక్క సాగునీరు కూడా అందే అవకాశం లేదు. లైనింగ్ కారణంగా 2.86 లక్షల ఎకరాలకు కూటమి ప్రభుత్వం సాగునీరు అందకుండా చేస్తోంది.

### 25 టీఎంసీలు కోల్పోతాం

జిల్లాలోని పీటీఎం మండలం కాట్నగల్లు పంచాయతీ నుంచి మొదలయ్యే పుంగనూరు ఉప కాలువ పలమనేరు నియోజకవర్గంలో కుప్పం ఉపకాలువతో కలిసిపోతుంది. కుప్పం నియోజకవర్గం పరమసముద్రం వద్ద హంద్రీ-నీవా ప్రాజెక్టు అంతం అవుతుంది. ఈ రెండు కాలువలు 343 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తాయి. వీటి లైనింగ్ పూర్తయ్యాక ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులు ఉన్నా చివరికి వెళ్లే సమయానికి 216 క్యూసెక్కులకు తగ్గిపోతుంది. దీంతో అనంతపురంజిల్లా నుంచి ఇక్కడికి చేరాల్సిన 12 టీఎంసీలకు ఈ కాలువ సామర్థ్య సరిపోదు. దీనికితోడు కడపజిల్లాలోని గండికోట రిజర్వాయర్ 13 టీఎంసీలను తరలించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను నిలిపివేడయంతో ప్రస్తుతం జరుగుతున్న లైనింగ్ పనులతో కేవలం కాలువలోకి నీళ్లు పారించేందుకు మాత్రమే సరిపోతుంది. కాలువ నుంచి కృష్ణా జలాలను ఆయకట్టుకు మళ్లే పరిస్థితులు లేకుండా చేస్తోంది. నీళ్లు తరలించాలన్న ఉద్దేశం కూడా ప్రభుత్వానికి లేనట్టుంది. లైనింగ్ పనులు చేసుకుపోతున్న ప్రభుత్వం చెరువులు, ఆయకట్టుకు నీళ్లు ఇచ్చేలా ప్రణాళికలు కాని, వాటి పనులు ఒక్కటి కూడా చేపట్టలేదు. దీంతో 25 టీఎంసీల నీటిని వినియోగించుకోలేని దారుణమైన పరిస్థితిని రైతాంగం ఎదుర్కొబోతోంది.

### పథకాలకు సమాధి కట్టి లైనింగ్

హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా అన్నమయ్య, చిత్తూరుజిల్లాలకు కృష్ణా జలాలను అదనంగా తరలించి కరువును రూపుమాపాలని గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. గాలేరు-నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులను అనుసంధానం చేసే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.4,373.23 కోట్లతో పనులు మొదలుపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి వెయ్యి కోట్లకుపైగా పనులు పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి జిల్లాలోకి పీటీఎం మండలం వద్ద హంద్రీ-నీవా కాలువలోకి కృష్ణా జలాలు తరలించేలా పనులు చేపట్టారు. ఈ పని పూర్తయితే జిల్లాకు అదనంగా 13 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి సద్వినియోగం చేసుకోవాలన్నది లక్ష్యం. అయితే ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేయడంతో రైతుల ఆశలను ఆడియాశలు చేసింది కూటమి ప్రభుత్వం. ఇది కాక పెద్దతిప్పసముద్రం మండలం కిలోమీటర్ 79.600 నుంచి పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కిలోమీటర్ 220.350 వరకు పుంగనూరు కాలువలో 1,180 క్యూసెక్కులు ప్రవహించేలా వెడల్పు చేసి చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 12 టీఎంసీలు ఉమ్మడిచిత్తూరు జిల్లాకు తరలించుకునేలా రూ.1,129 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులు చేపట్టింది. ఈ రెండు మార్గాల్లో 25 టీఎంసీలు తరలించుకుంటే శాశ్వత కరువు నివారణ, సాగు, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయి. అయితే ఈ పథకాలను కూటమి ప్రభుత్వం కక్షకట్టి పక్కన పెట్టి తనకు అనుకూలమైన లైనింగ్ పనులు చేపట్టి రైతుల ఆశలపై సమాధి కట్టేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,144.50 కోట్లతో తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లోని ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణాలను టీడీపీ నేతలు కోర్టు కేసులతో అడ్డుకుని పనులు నిలిపివేయించారు. దీంతో 25 టీఎంసీల్లో ఈ మూడింటికి కేటాయించిన 6.5 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకోలేని పరిస్థితి కల్పించారు.

### పెద్దిరెడ్డి చేసిన కృషిని చూసి ఓర్వలేక..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాను సాగునీటితో సస్యశ్యామలం చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసిన కృషి మరువలేనిది. వైఎస్సార్‌సీపీని ఆదరిస్తున్న ప్రజలు, రైతుల కోసం ప్రత్యేకంగా మూడు రిజర్వాయర్లు, పీబీసీ వెడల్పు, హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల అనుసంధాన పథకం మంజూరుకు చేసిన కృషి ఈ ప్రాంత ప్రజలకు తెలుసు. దీంతో రాజకీయంగా టీడీపీ బలహీన పడుతుందని ఈ పథకాలపై పెద్దిరెడ్డి కుటుంబ ముద్ర ఉండకూదడన్న కక్షతో కూడా ప్రభుత్వం వాటిని పక్కనపెట్టిందని ఈ ప్రాంత ప్రజలు గుర్తించారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీబీసీలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు (ఫైల్)

# జాతీయ రహదారి పనుల పూర్తికి చర్యలు

**జేసీ ఆదర్శ్ రాజేంద్రన్**



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

లక్కిరెడ్డిపల్లి: రాయచోటి- చాగలమర్రి జాతీయ రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి ఎంపీడీఓ సభా భవనంలో రహదారి విస్తరణలో ఇంటిస్థలాలు, ఇళ్లు కోల్పోతున్న లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇంటిస్థలాలు, ఇంటి పట్టాలు, ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారాన్ని ఇప్పటికే ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. చాలా మందికి నష్టపరిహారం కింద వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు. ఇంకా పరిహారం అందని వారు కలెక్టర్‌కు విన్నవించుకొని పరిష్కారం చేసుకోవాలన్నారు. వచ్చేనెల 10వ తేదీలోపు జాతీయ రహదారి విస్తరణలో ఉన్న ఇళ్లు, ఇళ్లస్థలాలు ప్రభుత్వం రోడ్డు విస్తరణ నియమించిన మార్కు వరకు తొలగించనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉషారాణి, మండల సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు గడువును మే 19 వరకు పొడిగించినట్లు మను కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ విలయత్ అలీ బేగ్ తెలిపారు. పదో తరగతి అర్హత (రెగ్యులర్ లేక ఓపెన్ )తో ఉర్దూ మీడియం లేకపోతే ఉర్దూ సబ్జెక్ట్ చదువుకొని ఉండాలని తెలిపారు. రెండో సంవత్సరం పాలిటెక్నిక్ అడ్మిషన్ పొందాలంటే రెండేళ్ల ఐటీఐ లేకపోతే ఇంటర్మీడియట్ చదివి ఉండాలని తెలిపారు. ఇందులో ప్రవేశానికి జూన్ 13వ తేదీ మధ్యాహ్నం రాత పరీక్ష కడప క్యాంపస్‌లో ఉంటుందని చెప్పారు. మనూలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్,అప్పరెల్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయన్నారు. వివరాలకు https://manuucoe. in/ RegularAdmissionలో తగు సమాచారం తెలిసుకోవచ్చని ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ తెలిపారు. వివరాలకు కళాశాల అడ్మిషన్ కన్వీనర్ ఎం.సికందర్ హుస్సేన్ (93980 83058)ను సంప్రదించాలని సూచించారు.

# నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం





జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్నజెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

- అందరికీ సమానంగా జెడ్పీ నిధులు
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: వేసవిలో గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అన్నారు. అవసరమైన గ్రామాల్లో కొత్త బోర్లు, మోటార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గురువారం జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి బోర్లకు యుద్ధ ప్రాతిపదికపై విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. గండిక్షేత్రంలో భక్తుల సౌకర్యం కోసం లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకర్‌ను నిర్మించేందుకు రూ.35 లక్షలు అవుతుందని, అందులో రూ.25 లక్షలు జెడ్పీ నిధులను సమకూరుస్తానని తెలిపారు. ఇందుకు సంబంధించిన అంచనా వ్యయాలను తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో అందరికీ సమన్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లె చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థులు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ఆ చెరువులో కాంట్రాక్టర్లు ఇష్టానుసారం గుంతలు తవ్వి మట్టి తరలించడం విద్యార్థుల మృతికి కారణమన్నారు. బాధ్యులైన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు వారినుంచే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఘన నివాళి: పాక్ దాడిలో అశువులు బాసిన వీర జవాను మురళీ నాయక్, వయోభారంతో ఇటీవల మరణించిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి మృతికి సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు.. ఒక హాల్టింగ్

- ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి
- వారానికి ఒకసారి చెర్లపల్లె-తిరుపతి స్పెషల్‌ట్రైన్
- ఒంటిమిట్టలో హాల్టింగ్ సౌకర్యం







ఒంటిమిట్ట రామాలయం

రాజంపేట: రాష్ట్రంలో వైష్ణవ క్షేత్రంగా వెలుగొందుతోంది ఒంటిమిట్ట(ఏకశిలానగరం) కోదండ రామాలయం. ఇక్కడ ఉన్న స్టేషన్‌లో ఇప్పటి వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వలేదు..ఇటీవల చర్లపల్లె-తిరుపతి (07017-07018) నంబరు గల స్పెషల్‌ట్రైన్‌కు ఎట్టకేలకు హాల్టింగ్ ఇచ్చారు. ఒకరకంగా హాల్టింగ్‌లో కదలిక మొదలైందని చెప్పుకోవచ్చు.

- రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ముందు ఒంటిమిట్టలో దూరప్రాంతరైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని రైల్వేమంత్రిత్వశాఖను కోరారు. అలాగే 'సాక్షి'లో రామయ్య దరిచేరేదేలా అనే శీర్షికతో అనేక మార్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వరనే నానుడి తుడిచిపెట్టుకుపోయింది.
- తిరుపతి-చర్లపల్లె మధ్య నడిచే స్పెషల్‌ట్రైన్‌కు హాల్టింగ్ ఇవ్వడంతో తెలంగాణా ప్రాంతం, కర్నూలు జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చేందుకు వీలు కలిగింది. శనివారం తిరుపతిలో 4.40 సాయంత్రం 4.40కి బయలుదేరి ఒంటిమిట్టకు 7.05 గంటలకు చేరుకుంటుంది. మరుసటిరోజు ఉదయం 7.10కి చర్లపల్లికు చేరుకుంటుంది. ఆదివారం రాత్రి 9.45కు చర్లపల్లెలో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 7.50కి ఒంటిమిట్ట, 10 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.

### రెగ్యులర్ ట్రైన్స్ హాల్టింగ్ సౌకర్యం కల్పించాలి

ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ మీదుగా నడిచే రెగ్యులర్ ట్రైన్స్‌కు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, రాయలసీమ, ఎంజీఆర్ చెన్నై ఎక్స్‌ప్రెస్, విశాఖ-కడప ఎక్స్‌ప్రెస్, హరిప్రియ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ఇది వరకే ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వేమంత్రిత్వశాఖను తన లేఖ ద్వారా కోరారు. అయితే స్పెషల్‌ట్రైన్‌కు హాల్టింగ్ ఇచ్చారంటే..ఇక రెగ్యులర్ ట్రైన్స్‌కూడా హాల్టింగ్ ఇచ్చే అంశాన్ని రైల్వేపరిశీలనలో ఉన్నట్లు కనిపిస్తోంది. రెగ్యులర్ ట్రైన్స్ హాల్టింగ్ ప్రభుత్వం, టీటీడీ నుంచి కూడా రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాలకు కనెక్టివిటీ కలుగుతుందని రైల్వే వర్గాలు చెపుతున్నాయి. తమిళనాడు, తెలంగాణా, ఏపీలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఒంటిమిట్టకు వచ్చేందుకు రైలు సౌకర్యం కల్పించాలన్న డిమాండ్‌ను ఎంపీ మినిస్టర్ ఆఫ్ రైల్వే దృష్టికి తీసుకెళ్లారు.

### అమృత్‌భారత్‌స్టేషన్ పథకంలో చేర్చాలి

ప్రధాని మోదీ ప్రారంభించిన అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ చేర్చాలని భక్తులు కోరుతున్నారు. ఈ నిధులతో రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలతోపాటు అధ్యాత్మికపరంగా తీర్చిదిద్దవచ్చిని రైల్వే వర్గాలు అంటున్నాయి. ఈ పథకంలో చేర్చేలా ఎంపీలు మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

### రెగ్యులర్‌రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి



తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాల నుంచే కాకుండా రాయలసీమ, కోనసీమ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఒంటిమిట్ట రామాలయానికి వస్తారు. తిరుపతికి వెళ్లే ప్రతి ఒక్కరూ రామయ్యను దర్శించుకుంటున్నారు. రైళ్ల హాల్టింగ్, స్టేషన్ అభివృద్ధి గురించి టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలి. ఇదే అంశంపై ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వేశాఖను కోరారు.ఇక్కడ రెగ్యులర్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి.

–ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ డైరెక్టర్, గిడ్డంగులశాఖ కార్పొరేషన్, ఒంటిమిట్ట

### ఒంటిమిట్టస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



దక్షిణమధ్యరైల్వే భద్రాచలం స్టేషన్‌లాగే ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దూరప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు చేరుకునేలా రైలుసౌకర్యం కల్పించాలి. అమృతభారత్ పథకంలో చేర్చాలి. స్పెషల్ ట్రైన్‌కు హాల్టింగ్ ఇవ్వడం సంతోషకరం

–ముమ్మడి నారాయణరెడ్డి, మాజీ చైర్మన్, రామాలయం, ఒంటిమిట్ట

## క్లుప్తంగా

### ముస్లిం సమాజానికి జకియాఖానమ్ ద్రోహం

– రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా

రాయచోటి : నమ్మకం, అభిమానం, ప్రేమతో అప్పగించిన ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ పదవులను జకియా ఖానమ్ బీజేపీ వద్ద తాకట్టు పెట్టి ముస్లిం సమాజానికి ద్రోహం చేసిందని రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా ఆరోపించారు. బుధవారం సాయంత్రం రాయచోటిలో ఫయాజ్‌బాషా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మైనార్టీలపై ప్రేమతో జకియాఖానంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్సీ భర్త అఫ్జల్ అలీఖాన్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా పదవి ఇస్తే డబ్బు కోసం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న పార్టీలకు సాయపడుతోందన్నారు. డబ్బు కోసం నమ్మి పదవులు అప్పగించిన పార్టీకి ద్రోహం చేసిన జకియాఖానంకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మదనపల్లె రూరల్ : మండలంలోని వన్నూర్ సాబ్ గుట్ట దర్గా సమీపంలోని లక్ష్మీదేవి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడటంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారి శివప్ప, సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.2లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు.

# మాండవ్యా నదిని కాటేస్తున్న కాలుష్యం

మాండవ్యా నదిని కాలుష్యం కాటేస్తోంది. పట్టణం గుండా ప్రవహించే ఈ నదిలో ఇప్పటికే ముళ్లకంపలు, తూడు, చెత్త పేరుకుపోయాయి. ఎటు చూసినా పట్టణ వాసులు వేస్తోన్న వ్యర్థాలు, జంతు కలేబరాలు దర్శనమిస్తున్నాయి. చుట్టుపక్కల ప్రజలు దుర్గంధం భరించలేని పరిస్థితి. మాండవ్యా నది ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని రాయచోటి పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పాతరాయచోటి బ్రిడ్జి సమీపంలో మాండవ్యా నది కనపడకుండా పెరిగిపోయిన కంపచెట్లు



మాండవ్యానదిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- పర్యావరణానికి పెను ముప్పు
- నిర్వహణ లోపం.. పేరుకుపోతున్న వ్యర్థాలు
- దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి మున్సిపల్ పరిధిలోని ఎగువ అబ్బవరం నుంచి ప్రారంభమై లక్ష్మీపురం, పాతరాయచోటి, మాసాపేటల గుండా వీరబల్లి మండలం వరకు మాండవ్యా నది ప్రవహిస్తోమంది. అనంతరం వీరబల్లి మండలంలోని పుల్లగూరమ్మ గండిలో కలుస్తుంది. వర్షాకాలంలో నీరు దిగువకు ప్రవహిస్తుండటంతో పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ వర్షం పడనకపోతే నీరు లేక పిచ్చి మొక్కలు, పలు రకాల వ్యర్థాలు పెరుగుతున్నాయి. పట్టణంలోని వ్యర్థాలు కాలువల గుండా మాండవ్యానదిలోకి చేరుతాయి. దీంతో నీరు సరిగ్గా ప్రవహించక ఎక్కడికక్కడ పేరుకుపోయి దోమలు పెరుగుతున్నాయి. నదికి ఇరువైపులా ఉండే ప్రజల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దుర్గంధం భరించలేకపోగా.. తరచూ జ్వరాల బారిన పడాల్సివస్తోందని ఇరువైపుల నివశించే ప్రజలు వాపోతున్నారు.

#### దుర్గంధం నుండి కాపాడాలి



మాండవ్యానదికి ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు దుర్గంధం భరించలేకపోతున్నారు. నదిని శుభ్రపరచకపోవడంతో ప్రజలు ఇక్కట్లపాలవుతున్నారు. ఇప్పటికే జ్వరాలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించి నదిని శుభ్రపరచాలి.

– డి.సతీష్‌కుమార్, రాయచోటి పట్టణం

#### మాండవ్యా నదిని ప్రక్షాళన చేయాలి



పట్టణంలోని మాండవ్యా నదిని ప్రక్షాళన చేయాలి. క్రమం తప్పకుండా ఏటా నదిలో పూడిక తీయించాలి. వర్షాకాలంలో అధికంగా వచ్చే నీరు దిగువకు వెళ్లేందుకు వీలవుతుంది. దానికి తోడు దుర్గంధం నిలువ లేకుండా ఉంటుంది.

– షేక్.అతావుల్లా, అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు, రాయచోటి

# ప్రైవేట్ బస్సుల టైమింగ్‌పై వివాదం

మదనపల్లె రూరల్ : రెండు ప్రైవేట్ బస్సుల మధ్య టైమింగ్ విషయమై గురువారం బెంగళూరు బస్టాండులో వివాదం ఏర్పడింది. పట్టణంలోని బెంగళూరు బస్టాండు నుంచి ప్రైవేట్ బస్సు సర్వీసులు బయలుదేరే సమయం విషయంలో రెండు బస్సుల సిబ్బంది మధ్య గొడవ జరిగింది. గొడవలో ఓ ప్రైవేట్ బస్సు కండక్టర్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాధితుడు మీడియాతో మాట్లాడుతూ....టైమింగ్ విషయమై రెండు బస్సుల సిబ్బంది గొడవ పడుతుండగా, మాజీ ప్రజాప్రతినిధి తన అనుచరులతో కలిసి తనపై దాడిచేశారన్నాడు. ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపాడు. అయితే, గొడవ జరిగిన విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ రామచంద్ర, వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ సిబ్బందితో కలిసి బెంగళూరు బస్టాండుకు చేరుకుని వివాదానికి కారణమైన రెండు ప్రైవేట్ బస్సులను ఆర్టీఓ విచారణ నిమిత్తం జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

# ఏఐటీయూసీ నాయకుల అవినీతిపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదుచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు రమణమ్మ

మదనపల్లె రూరల్ : దినసరి పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న తనను ఆప్కాస్ విధానంలో కార్మికురాలిగా చేర్పిస్తామని ఏఐటీయూసీ నాయకులు రూ.70 వేలు వసూలు చేశారని మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు స్థానికురాలు పోగుండ రమణమ్మ గురువారం ఫిర్యాదుచేశారు. మీడియాతో రమణమ్మ మాట్లాడుతూ...మున్సిపాలిటీ రెండో డివిజన్‌లో దినసరి పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న తన వద్దకు ఏఐటీయూసీ నాయకులైన పృథ్వీరాజ్, ఓబులేసు, నాగరాజు వచ్చి ఆప్కాస్ విధానంలోకి మారుస్తామని చెప్పారన్నారు. పై అధికారులకు రూ.70 వేలు చెల్లించాలని ఒత్తిడి చేశారని, వారి మాటలు నిజమని నమ్మి 16.1.2024న రూ.70 వేలు ఇచ్చానన్నారు. తనను ఆప్కాస్‌లో చేర్చకపోగా, తన డబ్బులు వెనక్కు ఇవ్వలేదని చెప్పింది. సమగ్ర విచారణ జరిపించి తనకు న్యాయం చేయాల్సిందిగా వేడుకుంది.

# కాలుష్యంతో ప్రాణాలు పోతున్నాయి



కాలుష్య నియంత్రణ అధికారితో మాట్లాడుతున్న గోవిందంపల్లి గ్రామస్తులు



కంకర క్రషర్‌లో వెదజల్లుతున్న కాలుష్యం

ఓబులవారిపల్లె : కంకర క్రషర్ ద్వారా నీరు కాలుష్యం అవుతోంది.. రోగాల బారిన పడి ప్రాణాలు పోతున్నాయి. కాపాడండి సారూ అంటూ మండలంలోని గోవిందంపల్లి గ్రామస్థులు అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. ఇటీవల కంకర క్రషర్‌పై ఫిర్యాదు చేయడంతో కర్నూలు, కడప ఉమ్మడి జిల్లా కాలుష్య నియంత్రరణ అధికారి సుధారాణి గురువారం పరిశీలించారు. గోవిందంపల్లి గ్రామస్థులు మాట్లాడుతూ కంకర క్రషర్ ద్వారా వెలువడే కాలుష్యంతో దుమ్ము, ధూళి పెరగడంతో కిడ్నీ, శ్వాస కోస, క్యాన్సర్ రోగాల బారిన పడి చాలామంది చనిపోయారన్నారు. అంతేగాక మంగంపేట ఏపీఎండీసీ గనులకు 300 మీటర్ల వరకు డేంజర్ ప్రాంతంగా ఏపీఎండీసీ అధికారులు ప్రకటించారని గుర్తు చేశారు. అయితే గనులకు 75 మీటర్ల లోపు కంకర క్వారీ ఏ విధంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. పేలుళ్లకు కాలుష్యం ప్రబలుతోందని, అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కాలుష్య నియంత్రణ అధికారిణి ఉషారాణి మాట్లాడుతూ అన్ని విషయాలు పరిగణలోకి తీసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ నియంత్రణ సహాయ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రాజు, చంద్రరాజు, కేశవరాజు పాల్గొన్నారు.

# విద్యార్థినిపై లైంగిక దాడికి యత్నం

**లైబ్రేరియన్ రామచంద్ర నాయక్‌పై కేసు నమోదు**

గాలివీడు : గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఓ చిన్నారి(10)పై లైంగిక దాడికి యత్నించిన లైబ్రేరియన్ రామచంద్రనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గాలివీడు గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న రామచంద్ర నాయక్ వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి గురువారం ఉదయం 10 గంటలకు విద్యార్థులు హాజరయ్యారు. రామచంద్రనాయక్ ఉన్నపాటుగా మగపిల్లలను మైదానంలో ఆడుకోవాలని పంపించాడు. మిగిలిన ఆడపిల్లల్లో ఒకరిని చెత్త ఊడ్చమని చెప్పాడు. ఆమె వెళ్తుండగా.. లైబ్రేరియన్ చిన్నారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. భయకంపితురాలైన చిన్నారి బిగ్గరగా అరుస్తూ బయటకు పరుగు తీసింది. విషయం తన సోదరి, సోదరుడు, నానమ్మకు తెలియజేసింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా పుస్తకాలు చదువుతారని పంపితే కామంతో కళ్ళు మూసుకుపోయి ఇలా చేస్తారా అంటూ బాలిక బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# మృతదేహం లభ్యం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు ఆర్సీఎం చర్చి వెనుక భాగాన తెలుగుగంగ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. అటుగా వెళుతున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ తిమోతిలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 60–65 సంవత్సరాల మధ్య ఉంటుందని, వారం రోజుల కిందట మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగార్జున, విష్ణు

కలకడ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కలకడ మండలం కె.బాటవారిపల్లెకు చెందిన కార్పెంటర్ నాగార్జున, అతని కుమారుడు విష్ణు శుక్రవారం ద్విచక్ర వాహనంపై పీలేరు వైపు వెళ్తున్నారు. కడపకు చెందిన శివ రాయచోటి నుంచి సోమలవైపు వెళ్తున్నారు. కె.బాటవారిపల్లి సచివాలయం సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో కార్పెంటర్ నాగార్జున, విష్ణులతోపాటు, శివకు తీవ్రగాయాలయ్యాయి. నాగార్జునను తిరుపతికి తరలించారు. కలకడ పోలీసులు విచారిస్తున్నారు.

# మహిళలపై కూటమి నాయకుల దాడి



గ్రామంలో మహిళలను బెదిరిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లి గ్రామంలో మహిళలపై కూటమి నాయకులు గురువారం రాత్రి స్థానిక విచక్షణా రహితంగా దాడి చేశారు. తుమ్మల జయమ్మ, సంధ్య, తుమ్మల స్పందన, మత్తయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో స్థల వివాదం ఉండడంతో పలు వివాదాలలో పాత్ర వహించిన రాపూర్ రమేష్, వినేష్, నితేష్, మరి కొందరు మహిళలపై దాడి చేసి బెదిరించారు. తాము పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పటికీ పోలీసులు తమతో మాట్లాడకుండానే రేపు సమగ్రంగా విచారించి చర్యలు తీసుకొంటామని చెప్పారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ హేమసుందర్ రావు మాట్లాడుతూ సంఘటనా స్థలానికి వెళ్లి విచారించాక తగిన విధంగా చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.



# ఏపీఈసెట్ ఫలితాలు విడుదల

**జిల్లాలో పలువురికీ ర్యాంకుల పంట**

కడప ఎడ్యుకేషన్ : అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన ఏపీఈసెట్ ఫలితాల్లో వైఎస్సార్ జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటి ర్యాంకుల పంట పండించారు. డిప్లమా హోల్డర్స్, బీఎస్సీ(మ్యాథమాటిక్స్) డిగ్రీ హోల్డర్స్ ఏపీ ఈసెట్‌లో అర్హత సాధించి లాటరల్ ఎంట్రీ ద్వారా ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్ లేదా ఫార్మసీలో ప్రవేశం పొందవచ్చు. ఈ నెల 6న నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. రాజుపాలెం మండలం కుటూరు గ్రామానికి చెందిన మెట్టా దివాకర్ రెండో ర్యాంకు, తొండూరు మండలం గుండ్లమడుగుకు చెందిన పల్లేటి రాజశ్రీ ఐదో ర్యాంకు, ఖాజీపేట మండలం సుంకేసులకు చెందిన తరుణ్ ఆరో ర్యాంకు, వేంపల్లి మండలం ముత్తకూరుకు చెందిన వద్దరపు గణేష్ ఆరో ర్యాంకు, జమ్మలమడుగు మండలం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన గువ్వల జయచంద్రారెడ్డి పదో ర్యాంకు సాధించి భళా అనిపించారు.

**సత్తా చాటిన మిషన్ డ్రైవర్ కొడుకు**



స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన బాల మహేష్

తల్లితండ్రుల కష్టాలను తీర్చాలని కష్టపడి చదివి ర్యాంకు సాధించాడు బాల మహేష్. వేముల మండలం మబ్బుచింతపల్లె గ్రామానికి చెందిన గుజ్జల మారుతి యురేనియం ప్యాక్టరీలో ఓ మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి గంగాదేవి గృహిణి. తల్లితండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన వారి కుమారుడు దేవి కుమారుడు గుజ్జల బాల మహేష్ కష్టపడి చదివి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు పులివెందులలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిన మహేష్ డిప్లమో మైనింగ్ కోర్సు పులివెందుల లయోలా కళాశాలలో పూర్తి చేశారు. తాజాగా ఏపీ ఈసెట్‌లో 111 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారు. పలువురు అతడిని అభినందించారు.

**కూలీ కొడుకుకు ద్వితీయ ర్యాంకు**



మెట్టు దివాకర్

కూలి పనులు చేసుకుంటున్న చిన్నపుల్లయ్య కుమారుడు ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకు సాధించాడు. రాజుపాలెం మండలం కూలూరు గ్రామానికి చెందిన మెట్టు చిన్నపుల్లయ్య, ఏసమ్మల కుమారుడు మెట్టు దివాకర్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. ఆ తరువాత డిప్లమా ఈఈఈని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తి చేశాడు. ఏపీ ఈసెట్ ఈఈఈ విభాగంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకు సాధించాడు. కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసి తల్లిదండ్రుల కష్టాలు తీరుస్తానని మెట్టు దివాకర్ తెలిపారు.



# ఘనంగా శ్రీ రెడ్డెమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ట



రెడ్డెమ్మతల్లి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన సంతాన ప్రదాయిని రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ట గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని ఇటీవల రూ.2.50 కోట్లతో పునర్నిర్మించారు. రెండు రోజులుగా నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించే కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో ప్రాతఃకాలపూజ, దేవతా ఉత్థాపనం, పంచామృతాభిషేకం, గర్త సంస్కారం నిర్వహించారు. పది గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రతిష్టా హోమం, ప్రాణప్రతిష్ట, కళాన్యాస హోమం, కళాన్యాసం, నేత్రోన్మీలనం, అలంకారం, కూష్మాండ బలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్థులు చేరుకుని అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఈవో మంజుల, దాతలు రెడ్డి పరంజ్యోతి, వీరాంజనేయప్రసాద్, సర్పంచులు ప్రేమకుమారి, ఆనంద్, ప్రసాద్‌నాయుడు, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, సుంకరశేఖర, సాకే చిన్నప్ప, నౌషాద్‌అలీ, పూజారి రెడ్డెప్పలు పాల్గొన్నారు.



# లారీ డ్రైవర్ బీభత్సం

- మద్యం మత్తులో బస్సును ఢీకొట్టి..
- ఐదుగురికి గాయాలు.

క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్



మద్యం మత్తులో వున్న లారీ డ్రైవర్



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీయడాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ

వల్లూరు : మద్యం మత్తులో లారీని నడిపిన డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. ఓ ద్విచక్ర వాహనం, ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న బంకు, దాని పక్కనే వున్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఐదుగురు గాయాలపాలవగా.. బంకుతోబాటు మూడు ద్విచక్ర వాహనాలు, బస్సు దెబ్బతిన్నాయి. వివరాల్లోకెలితే.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిరుమలపురానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ అబ్దుల్ అహమ్మద్ గురువారం గుజరా సామగ్రితో తాడిపత్రికి వెళ్తున్నారు. మద్యం మత్తులో కడప –తాడిపత్రి ప్రధాన రహదారిలో పాపాఘ్ని నగర్(కట్ట) బస్టాపు వద్ద లారీతో వేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని, దానికి ముందు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు బస్సును ఢీకొట్టాడు. అనంతరం అదుపు తప్పి రోడ్డు పక్కన వున్న బంకును, దాని పక్కనే పార్కు చేసి వున్న రెండు ద్వి చక్రవాహనాలపై ఎక్కించాడు. చివరకు అదుపు తప్పి పక్కనే వున్న చెట్టును ఢీకొట్టాడు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుయాడు. స్థానికులు అతన్ని బయటకు తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఎస్‌ఐ పెద్ద ఓబన్న తన సిబ్బందితో వచ్చి జేసీబీ సహాయంతో లారీని కదిలించి రెండున్నర గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

- లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులతో బాటు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మితిమీరి మద్యం తాగి నడపడమే కారణంగా తెలుస్తోంది.